ఆర్థిక వృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదు

ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ జనరల్ సెక్రటరీ వి.రమేష్

(ప్రజాశక్తి ప్రతినిధి – వరంగల్)

ఆర్థిక వృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదని ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ జనరల్ సెక్రటరీ వి.రమేష్ అన్నారు. హన్మకొండలో జరుగుతున్న సౌత్ సెంట్రల్ జోనల్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 8వ మహాసభల్లో రెండో రోజైన ఆదివారం ఆయన మాట్లాడారు. అమెరికా పెట్టుబడిదారీ విధానాల వల్ల స్టాక్ మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడుతోందన్నారు. నిరుద్యోగం పెరుగుతుందన్నారు. అగ్రరాజ్యం ఆహార పంటలను ఇంధన ఉత్పత్తికి వాడడం వల్లే ప్రపంచ వ్యాప్తంగా ఆహార కొరత ఏర్పడిందన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు వేగంగా పెరుగుతున్నాయన్నారు. దేశంలో 40 మంది బిలియనీర్ల వద్ద 14లక్షల కోట్ల రూపాయల సంపద కేంద్రీకృతమై ఉందని ఫోర్బ్స్ పత్రిక తెలిపిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారన్నారు. నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గత టిడిపి ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాలను అవలంభిస్తుందన్నారు. నేడు ఎల్ఐసి 8లక్షల కోట్లకు పైబడిన ప్రజా పెట్టుబడులతో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని గుర్తుచేశారు. ప్రీమియం ప్రాతిపదికన ఎల్ఐసి 82శాతం మార్కెట్ షేర్‌ను కలిగి ఉందన్నారు. ఎల్ఐసి 99.8శాతం క్లెయిమ్‌లు పరిష్కరిస్తుంటే ప్రయివేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలు 72శాతం క్లెయిమ్‌లు మాత్రమే పరిష్కరిస్తున్నాయని తెలిపారు.

ఆకర్షించిన కార్టూన్ ఎగ్జిబిషన్

మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్టూన్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకర్శించింది. ఆలిండియా ప్రెసిడెంట్ అమానుల్లాఖాన్ కార్టూన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ మహాసభల్లో అరుణకుమారి, మచిలీపట్నం మహిళా ప్రతినిధి ఉమామహేశ్వరి, హైదరాబాద్ డివిజన్ మహిళా ప్రతినిధి సరిత మాట్లాడారు.

పరిహారానికి నోచని చెంచులు

ముంపునకు గురైన 14 ఎకరాలు

(ప్రజాశక్తి విలేకరి–కొల్లాపూర్)

మహాత్మాగాంధీ లిఫ్టు ఇరిగేషన్ (ఎంజిఎల్ఐ) మొదటి లిఫ్టు రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన చెంచు మహిళా రైతులకు నేటికీ పరిహారం అందలేదు. ఈ లిఫ్టు కింద 14 ఎకరాల భూమిని మహిళా రైతులు కోల్పోయారు. ప్రత్యామ్నాయంగా భూములు కొనుగోలు చేసి, ఇవ్వాల్సి ఉన్నా నీటి పారుదల శాఖాధికారులు ఆ చర్యలు చేపట్టడం లేదు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు చెంచుకాలనీకి చెందిన బరుముల మల్లమ్మ రెండెకరాల భూమి, ఉడుతనూరి ఈదమ్మ రెండెకరాలు, అయిలేని చెన్నమ్మ రెండెకరాలు, వరుముల లక్ష్మీ రెండెకరాలు, నిమ్మల నర్సమ్మ రెండెకరాలు, మెరుపుల బయ్యమ్మ రెండెకరాలు, మెరుపుల పద్మమ్మ రెండెకరాలు మొత్తం 14 ఎకరాలను మొదటి లిఫ్టు కింద కోల్పోయారు. ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారాన్ని ఇవ్వకుండా ఐటిడిఎ అధికారులు తమవద్దే ఉంచుకున్నారని బాధితులు విమర్శిస్తున్నారు. భూములు కొనివ్వాలని అధికారుల చుట్టు తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కొనిచ్చి, న్యాయం చేయాలని కోరుతున్నారు.

భూమి కొనిస్తాం : పిఓ ఎం.నాయక్

భూములు కోల్పోయిన ఏడుగురు చెంచు మహిళా రైతులకు భూములు కొనుగోలు చేసి ఇస్తామని ఐటిడిఎ పిఓ ఎం.నాయక్ ప్రజాశక్తికి వివరణ ఇచ్చారు. నీటి పారుదల శాఖ తమకు నష్టపరిహారం చెల్లించిందనీ, అదేస్థాయిలో భూములు కొనుగోలు చేసి ఇస్తామనీ తెలిపారు.



భూములే కావాలి

ఎంజిఎల్ఐ మొదటిలిఫ్టులో భూములు కోల్పోయిన మాకు డబ్బులివ్వాలని అధికారులను అడిగితే భూమి కొనిస్తామని చెప్పారు. అప్పుడిస్తాం, ఇప్పుడిస్తాం అని కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం భూమికి సరిపోదు. అసలు మాకు పరిహారమే వద్దు. భూమికి భూమే ఇవ్వాలి. లేదంటే ఆందోళన చేస్తాం.

నర్సమ్మ, ఈదమ్మ

22న చేనేత మహాధర్నా

(ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో)

ఈనెల 22న అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేనేత మహాధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్ష పార్టీల నేతలు తెలిపారు. ఈ ధర్నాలో టిడిపి, సిపిఎం, సిపిఐ, లోక్‌సత్తా, ప్రజారాజ్యం, టిఆర్ఎస్, బిజెపి, ఎన్‌టిపిపి, తల్లి తెలంగాణా, టిఆర్ఎస్ (ఎన్) పార్టీల అధినేతలు హాజరుకానున్నట్లు చెప్పారు. చేనేత మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ రమణ, కర్నాటి వెంకటేశం (టిడిపి నేతలు), జెల్లా మార్కండేయులు (టిఆర్ఎస్ కార్యదర్శి), కూరపాటి రమేష్ (సిపిఎం), అందె నర్సింహ్మారావు (సిపిఐ), వనం ఝాన్సీ, కర్నాటి ధనుంజయ (బిజెపి), తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ అధికారంలోకి రాకముందు చేనేత రంగాన్ని ఆదుకుంటామని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో చేనేతల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కుటుంబాల్లో కుటుంబ సభ్యులంతా పనిచేసినా నెలకు మూడు వేల రూపాయలే వస్తున్నాయని, అవి గిట్టుబాటు కావడంలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే సహకార, సహకారేతర రంగంలోని ప్రభుత్వ, ప్రయివేటు చేనేత రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కుటుంబానికీ ఆరు వేల రూపాయల నెలసరి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మగ్గానికీ లక్ష రూపాయల రుణ సదుపాయాన్ని ప్రభుత్వ గ్యారెంటీతో కల్పించి పావలా వడ్డీ అమలు చేయాలని, చేనేత, మరమగ్గాలపై తయారైన బట్టలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.500లకు పెంచాలని, చేనేత ముడిసరుకుపై 20 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహకారేతర రంగంలోని వారికి చేనేత బట్టల అమ్మకాలపై 20 శాతం రిబేటు నిరంతరం కొనసాగించాలని కోరారు. ధర్నాకు పెద్దఎత్తున నేత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

హైదరాబాద్ : దళిత యువకుడు సోమశేఖర్ కిడ్నీని మాయం చేసిన హైదరాబాద్‌కు చెందిన సాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఆసుపత్రిలోని వైద్యులు విద్యాసాగర్ రెడ్డి, టివి శ్రీనివాసులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని, బాధితుడికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాటూరు రామయ్య, జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన దళిత యువకుడు సోమశేఖర్ ఐదు సంవత్సరాల క్రితం స్కూటర్ ప్రమాదానికి గురై చికిత్స కోసం హైదరాబాద్‌లోని సాయికృష్ణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరగా వైద్యులు ఆపరేషన్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ శనివారం నిర్వహించిన సామర్థ్య ఆధారిత వేతనాల రాత పరీక్షలను విజయవంతంగా బహిష్కరించిన ఉద్యోగులకు ఏపి స్టేట్ హెచ్ఐవి కౌన్సిలర్స్ అండ్ ల్యాబ్ టెక్నిషియన్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం కృతజ్ఞతాభినందనలు తెలిపింది. ఈమేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎం జ్యోతి కుమార్, బండారు శ్రీనివాస్ ఆది వారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రశ్నించే తత్వాన్ని పెంచేందుకు జెవివి ఉద్యమించాలి : చుక్కా రామయ్య

(ప్రజాశక్తి విలేకరి – మహబూబాబాద్)

నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, పాఠశాల విద్యార్థుల ఆలోచన పెరిగేలా, ప్రతి ఒక్కరిలోనూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చే విధంగా జనవిజ్ఞాన వేదిక(జెవివి) కార్యక్రమాలు రూపొం దించుకొని ఉద్యమించాలని ప్రముఖ విద్యా వేత్త చుక్కా రామయ్య పిలుపు నిచ్చారు. వరంగల్ జిల్లా జెవివి పదో వార్షిక సభను మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. జెవివి పతాకాన్ని ఆవిష్కరించిన చుక్కా రామయ్య మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థు లకు న్యూటన్ గమన పాఠాలను, నన్నయ్య పాఠాలను ఒకేవిధంగా బోధిస్తున్నారని, ఈ విధానం మారా లని అన్నారు. సైన్స్ ప్రయోగం లేకుండా పాఠాలు బోధించడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. ప్రతి వ్యక్తీ సమాజంలో ఒక సామాజిక శాస్త్రవేత్తలా మారి సమాజాన్ని అవ గాహన చేసుకోవాలన్నారు. భూస్వామ్య భావజాల పాలకులను ప్రశ్నించాలని కోరారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారానే ఆర్థికాభివృద్ధి

యుబిఐఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణబ్‌చౌదరి

(ప్రజాశక్తి విలేకరి–విజయవాడ)

ప్రభుత్వరంగ బ్యాంకులను బలోపేతం చేయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమౌతుందనీ, ఎంతటి సంక్షోభాన్నైనా తట్టుకునేందుకు వీలవుతుందని యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ యూనియన్ (బెఫి) జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రణబ్ చౌదరి అన్నారు. బెఫి ఐదో రాష్ట్ర మహాసభలు ఆదివారం విజయవాడలో జరిగాయి. ప్రణబ్‌చౌదరి ప్రారంభోపన్యాసం చేశారు. సామాన్య ప్రజానీకానికి బ్యాంకింగ్ రంగం అనేక సేవలను అందిస్తోందన్నారు. ప్రపంచంలోనే బ్యాంకింగ్ రంగం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో కొద్దిపాటి ఒడిదుడుకులతోనైనా దేశ బ్యాంకింగ్ రంగం స్థిరంగా ఉండగలిగిందన్నారు. నూతన ఆర్థిక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడంలో ఉద్యోగ వర్గాలతోపాటు వామపక్షాలు చేసిన కృషి ఫలితంగానే మనం సంక్షోభం బారిన పడలేదని అన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాలపై, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై బెఫీ యుద్ధాన్నే ప్రకటించాల్సి వచ్చిందన్నారు. బ్యాంకుల విలీనాన్ని అడ్డుకునేందుకు ఉద్యోగ వర్గాలు సిద్ధం కావాలని కోరారు. పింఛన్ స్కీమును వెంటనే ప్రకటించాలనీ, వేతన సవరణ ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉన్నా భారతదేశం మాత్రం కొన్ని ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా స్థిరంగానే ఉండగలిగిందన్నారు. దీనికి ప్రధాన కారణం దేశంలో ప్రధాన ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ రంగం ప్రభుత్వ నియంత్రణలోనే ఉండటంతోపాటు, బలమైన కార్మికోద్యమాలు జరగడమేనని అన్నారు. వీటితోపాటు వామపక్షాలు ఎప్పటికప్పుడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను రానీయకుండా పాలకులను నిలవరించగలిగాయన్నారు. ఉత్పత్తి రంగం సంక్షోభంలోకి నెట్టబడటానికి అమెరికా వంటి దేశాల్లో వినిమయ సంస్కృతి పెరగడమే కారణమని అన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని గుణపాఠాలుగా తీసుకోవాలనీ, విదేశీ పెట్టుబడుల ప్రభావాలు భారత పాలకులకు కనువిప్పు కావాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పటిష్టం చేయాలనీ, రీసైక్లింగ్ ఫండ్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాల పెట్టుబడులను పెంచాలని కోరారు. దేశంలో ఇప్పటికీ 49 శాతం మందికి బ్యాంకింగ్ రంగ సేవలు అందడం లేదనీ, వాటిని అభివృద్ధి చేస్తే అసంఘటిత రంగాన్ని పీడిస్తున్న వడ్డీవ్యాపారుల పీడ వదులుతుందని అన్నారు. దీని ద్వారా ఆర్థిక పరిపుష్టత చేకూరడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని అన్నారు. కార్యక్రమానికి బెఫీ నాయకులు జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బార్న్‌బిశ్వాస్, వైస్ ప్రెసిడెంట్ ఎంవి.మాధవరావు, ఆంధ్రాబ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, బెఫీ కోశాధికారి సుధీర్ చక్రవర్తి, సిఐటియు నగర జాయింట్ సెక్రటరీ పిఆర్‌కె.రెడ్డి, బెఫీ నగర నాయకులు, ఆహ్వానసంఘం అధ్యక్షులు ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడారు.

యుబిఐఇయు రాష్ట్ర మహాసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నాగేశ్వర్

ఏజెంట్లకు సంక్షేమ నిధి

ఎల్ఐసిఎఓఐ డిమాండ్

(ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో)

ఎల్ఐసి ఏజెంట్లందరికీ సంక్షేమనిధి ఏర్పాటు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఆరోగ్యబీమా, తదితర సౌకర్యాలు కల్పించాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఎఓఐ) కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్ఎస్ పొట్టి డిమాండ్ చేశారు. సంక్షేమనిధి కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పై డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. అందులో భాగంగా నవంబరు 20న దేశంలోని అన్ని ఎల్ఐసి బ్రాంచీల ముందు, డిసెంబరు 17న దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఎల్ఐసి డివిజన్ బ్రాంచీల ముందు, ఫిబ్రవరిలో పార్లమెంటు వద్ద ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తామని వివరించారు. తమిళనాడు ఎంపీ ఎవి బెల్లారిమన్ మాట్లాడుతూ ఎల్ఐసిఎఓఐని సిఐటియుకు అనుబంధంగా మార్చాలని రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతన్న తమ ఆర్గనైజేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించిందన్నారు. దేశంలో ప్రస్తుతం 12 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు ఉన్నారని, వీరిలో ఎల్ఐసిఎఓఐకి లక్ష మంది సభ్యులున్నారని చెప్పారు. డిసెంబరు నాటికి సభ్యత్వాన్ని రెండు లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనిపై దేశవ్యాప్త నిరసన చేపడతామని హెచ్చరించారు. భారత్–అమెరికా అణు ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమ ఆర్గనైజేషన్ జనరల్ కౌన్సిల్ తీర్మానం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసిఎఓఐ జాతీయ ఉపాధ్యక్షులు సిఎ జోసెఫ్, ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ఇక వేతనాల్లో కోత

సీనియర్లకు జెట్ – జూనియర్లకు కింగ్‌ఫిషర్

ముంబయి : నిన్నటి వరకు ఉద్యోగులను తగ్గిస్తామంటూ నోటీసులు పంపిన జెట్ ఎయిర్‌వేస్ సంస్థ, అది విజయవంతం కాకపోవడంతో వేతనాల్లో కోత విధించే దిశగా అడుగులేస్తోంది. ఈ మేరకు సంస్థ అధికార ప్రతినిధి మాట్లాడుతూ 'సీనియర్ల మేనేజిమెంట్ కాంట్రాక్టులను రెన్యువల్ చేసేటప్పుడు వారి వేతనాల్లో కోత విధించబోతున్నాం. సంస్థ బతకాలంటే, సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే ఇది అనివార్యం.' అని చెబుతున్నారు. కింగ్‌ఫిషర్ 50మంది పైలెట్ ట్రైనీల వేతనాల్లో కోతను విధించింది. ప్రస్తుతం లైన్ మీదున్న పైలెట్లకు, అలాగే ఫీల్డ్ స్టాఫ్ వేతనాల్లో కోత విధించడం లేదని సంస్థ ప్రకటించింది.

రియాల్టీకి గిరాకీ తగ్గలేదు: మకాన్ సర్వే

(ప్రజాశక్తి బిజినెస్‌బ్యూరో)

హైదరబాదు నగరంలో తాము నిర్వహించిన సర్వే ప్రకారం రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి గిరాకీ పెద్దగా తగ్గలేదని మకాన్ డాట్ కామ్ ప్రకటించింది. ఇక్కడ మకాన్ డాట్ కామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ప్రాపర్టీ షో సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కంపెనీ బిజినెస్ హెడ్ ఆదిత్య వర్మ మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ నెలలో 53,577 మందిని, ఆగస్టు నెలలో 60,183 మందిని హైదరాబాదు నగరంలోనే సర్వే చేశామన్నారు. ఈ మొత్తం సర్వేలో 50 శాతం మంది హైదరాబాదులోను, 35 శాతం మంది సికింద్రాబాదు ప్రాంతంలోను, 15 శాతం మంది అవుటర్ ప్రాంతంలోను ప్రాపర్టీలను కొనుగోలు చేయటానికి సుముఖంగా ఉన్నారని, అలానే 30 లక్షల లోపు ప్రాపర్టీలను కొనటానికి 44 శాతం, 30 లక్షల నుంచి 60 లక్షల లోపు ప్రాపర్టీలను కొంటానికి 25 శాతం మంది సుముఖంగా ఉన్నారని అలానే జూన్, ఆగస్టు నెలల మధ్యన చేసిన సర్వేలో 12 శాతం మాత్రమే గిరాకీ తగ్గినట్లుగా వచ్చిందని వివరించారు. అందుకనే నగరంలో రెండు రోజుల ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నట్లుగా వివరించారు.ఈ సమావేశంలో సాప్ కన్‌స్ట్రక్షన్ సిఇఓ రాజశేఖర్, డిఎమ్‌వి ఇన్‌ఫ్రా సిఒఓ మహేంద్రకుమార్ కూడా పాల్గొన్నారు.

ఎఫ్‌డిఐల ఫ్లో తగ్గొచ్చు : కమల్‌నాథ్

న్యూఢిల్లీ : అమెరికా సంక్షోభ ప్రభావం వల్ల ఎఫ్‌డిఐల ఫ్లో తగ్గే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి కమల్‌నాథ్ చెప్పారు. 'ఎఫ్ఐఐలు జనవరి నాటికి బాగా వచ్చి ఆ తరువాత వెనక్కు వెళ్లిపోతున్నాయి. అయితే ఎఫ్‌డిఐలు అలాకాకుండా రావడం తగ్గే అవకాశం ఉంది.' అని ఆయన అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 35బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐ వస్తుందని అంచనా వేయగా, మొదటి అయిదు నెలల్లో 14.6బిలియన్‌డాలర్ల ఎఫ్‌డిఐ వచ్చింది. ఇప్పుడు మందగించవచ్చని కమల్‌నాథ్ చెబుతున్నారు.

210మిలియన్లకు క్యాష్-కార్డులు

ముంబయి: కరెన్సీ స్థానంలో ప్లాస్టిక్ కరెన్సీ ఎక్కువ వాటాను ఆక్రమించబోతోంది. సెలెంట్ అనే సంస్థ చేసిన సర్వేలో 2010 నాటికి 210మిలియన్ల మేర డెబిట్, క్రెడిట్ కార్డులు మనదేశంలో చెలామణి అవుతాయని తేలింది. ఇందులో డెబిట్‌కార్డులు 169 మిలియన్లు కాగా, 40మిలియన్లు క్రెడిట్ కార్డులుంటాయని సర్వే తెలిపింది. ప్రస్తుతం మార్కెట్లో 130మిలియన్ల డెబిట్, క్రెడిట్ కార్డులున్నాయని, ఇందులో 27.5మిలియన్ల క్రెడిట్‌కార్డులతో 14.5బిలియన్ డాలర్ల ట్రాన్జాక్షన్స్ జరుగుతున్నాయని సెలెంట్ పేర్కొంది.

విదేశీ మారక నిల్వలు తరిగిపోతున్నాయ్..

వారంలోనే 10 బిలియన్ డాలర్లు మాయం ★ అమెరికా సంక్షోభం ఫలితమిది ★ కొనసా..గుతన్న ఎఫ్ఐఐల ఉపసంహరణ

(ప్రజాశక్తి – బిజినెస్‌బ్యూరో)

ఆర్‌బిఐ విడుదల చేసిన వారాంతపు గణాంకాల వివరాలు హెచ్చరికల గంటను మోగిస్తున్నాయి. అక్టోబరు 10తో ముగిసిన వారంలో రికార్డు స్థాయిలో 9.94బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు తరిగిపోయాయి. దీంతో మన విదేశీ మారకనిల్వల సామర్థ్యం 284 బిలియన్ డాలర్ల నుంచి 274 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకు ముందు వారంలో సైతం 7.8 బిలియన్ డాలర్లు మారకం తరిగిపోయింది. అంటే కేవలం రెండు వారాల్లోనే 18 బిలియన్ డాలర్లు తగ్గిపోయాయి. పరిస్థితి చూస్తే రాను రాను తరిగిపోతున్న నిల్వల సామర్థ్యం అధికంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. దీని వల్ల తిరిగి విదేశీ మారకపు లోటు దిశగా పయనించబోతున్నామా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది మే,23న విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 316.17బిలియన్ డాలర్లను తాకాయి. దీనితో ఇప్పటి నిల్వలను పోలిస్తే దాదాపు 42.17బిలియన్ డాలర్లు తగ్గినట్లు. అప్పుడు అమెరికా సంక్షోభం తీవ్రత అంతగా బయటపడలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అమెరికా అభివృద్ధి బుడగ పేలిపోవడంతో మారకం తరిగిపోవడంలో వేగం పెరిగింది.

ఇలా విదేశీ మారక ద్రవ్యం తరిగిపోవడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి విదేశీ మారక నిల్వలను కొత్త ధరల ప్రకారం పునర్మూల్యాంఖనం చేయడం. రెండోది అమెరికా, యూరోప్ దేశాల్లో వచ్చిన సంక్షోభం వల్ల వచ్చిన నష్టాలను పూడ్చుకునేందుకు, రాబోయే కొత్త అవకాశాలను దక్కించుకునేందుకు మన దేశ స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు విపరీతంగా పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నాయి. మొదటి కారణం ప్రభావం కంటే రెండోది అనేక వందల రెట్ల ప్రభావాన్ని చూపిస్తోంది. ఇదికాకుండా అమెరికా ఆర్థికవ్యవస్థ పతనంతో ఐటి సర్వీసుల ఎగుమతుల్లో కూడా తగ్గుదల వచ్చింది.

1993లో తొలిసారిగా మనదేశంలోకి అడుగు పెట్టిన విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐ)లు తాజాగణాంకాల (అక్టోబరు 10,2008) ప్రకారం దాదాపు 238 అతిపెద్ద కంపెనీలలో గణనీయమైన వాటాలను దక్కించుకున్నాయి. వీటిల్లో 30శాతం ఎఫ్ఐఐ వాటాలు న్నవి 17, 40శాతం దాకా ఉన్నవి 31, 49శాతం దాకా 52, 74శాతం దాకా 108, వందశాతం ఉన్నవి 30 కంపెనీలున్నాయి. అమెరికాలో ఆర్థిక సంస్థలు చేసిన అడ్డగోలు వ్యాపారం వల్ల సంక్షోభం తలెత్తిన నాటి నుంచి ఆయా కంపెనీల్లోంచి ఎఫ్ఐఐలు వాటాలను ఉపసంహరించుకోవడం ప్రారంభించాయి. దీంతో దాదాపు 173 కంపెనీల షేర్‌ప్యాటర్న్ (వాటాల నిష్పత్తి) మారిపోయింది.

ఇంతపెద్ద నష్టం దీనివల్లే సంభవించలేదు. మరో రెండు కారణాలు కూడా తోడయ్యాయి. ఒకటి సెబీ వద్ద రిజిస్టరయిన ఎఫ్ఐఐల (1539) కంటే మూడు రెట్లు ఎక్కువగా వాటి సబ్‌ఎకౌంట్లున్నాయి(4696). ఈ సబ్‌ఎకౌంట్ల మీద నియంత్రణ లేకపోవడంతో 2007లో మనదేశంలోకి ఎఫ్ఐఐలు కుప్పలు తెప్పలుగా పెట్టుబడులను తీసుకువచ్చాయి. ఆర్‌బిఐ ప్రకటించిన గణాంకాల మేరకు ఈ ఎఫ్ఐఐలు మనదేశంలోకి 17.8బిలియన్ డాలర్లను తీసుకొచ్చాయి. అందుకే జనవరిలో బిఎస్ఇ సెన్సెక్స్ 21వేల మార్కును తాకింది. దీంతో 31-12-2007నాటికి ఎఫ్ఐఐల రూపంలో మనదేశంలోకి వచ్చిన పెట్టుబడుల మొత్తం 66.32బిలియన్‌డాలర్లకు చేరింది.

అప్పటినుంచే అమెరికా ఆర్థిక వ్యవస్థ మీద అనుమానాలు రావడం, అవి క్రమంగా బలపడడం, అక్కడ అభివృద్ధి బుడగపేలిపోవడంతో మన దేశంలోని ఎఫ్ఐఐలు వెనక్కు వెళ్లిపోనారంభించాయి. దీంతో 16-10-2008నాటికి ఎఫ్ఐఐల పెట్టుబడుల మొత్తం 55.23బిలియన్‌డాలర్లకు పడిపోయింది. మొత్తం 11.09బిలియన్ డాలర్లు, అంటే 16.72శాతం మేర తగ్గిపోయింది. దీనివల్లేనే మన సెన్సెక్స్ సగానికంటే ఎక్కువ స్థాయికి పడిపోయింది. అందులోనూ ఒక్క అక్టోబరు రెండు వారాల్లోనే 2.5బిలియన్‌డాలర్లు (రూ.9,869.40 కోట్లు) వెనక్కు వెళ్లిపోయాయి. అమెరికా బెయిలవుట్ ప్యాకేజీని పారదర్శకంగా రూపొందించలేదన్న అనుమానాలున్న నేపథ్యంలోనూ, అవి ఆర్థిక సంస్థలకు లాభాలను చేకూర్చేవిధంగా ఉన్నాయన్న కారణాల వల్లనూ మనదేశంనుంచి మరిన్ని ఎఫ్ఐఐల పెట్టుబడులు వెనక్కు వెళ్లిపోవడం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎగుమతులు వల్ల వచ్చే విదేశీ మారకద్రవ్యం అమెరికాలో మాంద్యంతో తగ్గుముఖం పట్టనారంభించింది. అంతర్జాతీయ ట్రేడింగ్‌లో మన రూపాయి కూడా తీవ్రంగా బలహీనపడుతోంది. దీనికోసం మరిన్ని డాలర్లను ఆర్‌బిఐ విడుదల చేస్తోంది. ఈ కారణాలన్నీకలిసి మన దేశీయ విదేశీ మారకద్రవ్యం తరిగిపోవడానికి కారణాలవుతున్నాయి.

అప్పులు ఫుల్ – డిపాజిట్లు అంతంతే..

ఒక వైపు నుంచి విదేశీ మారక నిల్వలు తగ్గుతుండగానే మరో వైపున బ్యాంకులు ఇచ్చే అప్పులు పెరుగుతున్నాయి. అందుకనే రిజర్వు బ్యాంకు ఇటీవల సిఆర్ఆర్‌ను తొమ్మిది శాతం నుంచి 6.5 శాతంకు తగ్గించి బ్యాంకింగ్ వ్యవస్థలోకి ఒక లక్ష రూపాయిలను విడుదలచేయవలసి వచ్చింది.

ఈక్విటీ మార్కెట్లో నికర అమ్మకందార్లుగా ఎఫ్ఐఐలు (విలువ రూ.కోట్లలో)

నెల	నికరకొనుగోలు	నికర అమ్మకాలు	నికరతేడా
జనవరి	105,960.80	123,187.70	-17,226.90
ఫిబ్రవరి	76,437.10	71,017.70	+5,419.90
మార్చి	70332.70	70,198.30	+124.40
ఏప్రిల్	62,969.60	61,990.60	+979.00
మే	60,640.30	65,557.60	-4,917.30
జూన్	61,490.60	72,068.30	-10,577.70
జులై	64,526.30	65,539.20	-1,012.90
ఆగస్టు	46,401.90	48,467.70	-2,065,80
సెప్టెంబర్	68,029.60	75,966.60	-7,937.00
అక్టోబరు17దాకా	31,942.00	41,811.60	-9,869.40
2008మొత్తం	642,346.10	689,007.30	-46,661.20

సెప్టెంబర్,26 నాటికి ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.51, 219 కోట్లు కొత్త అప్పులు ఇవ్వటంతో మొత్తం బ్యాంకులు ఇచ్చిన అప్పుల మొత్తం రూ.25,42, 467 కోట్లకు చేరాయి. దీంతో ఈ కాలంలో బ్యాంకు అప్పులు గతేడాది కన్నా 24 శాతం పెరిగి రిజర్వు బ్యాంకు లక్ష్యమైన 20 శాతాన్ని మించిపోయాయి. అదే సమయంలో బ్యాంకు డిపాజిట్లు మాత్రం రూ.36,781 కోట్లు (19.8శాతం) మాత్రమే పెరిగి రూ.34,42,138 కోట్లకు చేరాయి. ఈ పై కారణాల రిత్యా రిజర్వు బ్యాంకు ఈ కాలం లోనే సిఆర్ఆర్ తగ్గించటంతో పాటు రూ.25,000 కోట్లు నిధులను బ్యాంకులకు విడుదల చేయవలసి వచ్చింది.



మరపురాని అక్టోబరు మాసం

భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో అక్టోబర్ మాసానికి ఒక ప్రత్యేకత వుంది. సెబి అందజేసిన గణాంకాల ప్రకారం 2004అక్టోబర్లో 270కోట్ల డాలర్లతో స్టాక్‌మార్కెట్లోకి వచ్చిన ఎఫ్ఐఐలు 2005 అక్టోబరు నాటికి 3887కోట్ల (16రెట్లు) డాలర్లకు చేరాయి. దీంతో సెన్సెక్స్ సూచి 5,757పాయింట్ల నుంచి ఒక్కసారిగా మూడువేలు పెరిగి 8,483కు చేరింది. స్టాక్ మార్కెట్లు ఇంతా భారీ పెరుగుదలను సంతరించు కుంటాయని సామాన్య మదుపుదారులు ఊహించలేక పోయారు. 2006 అక్టోబర్ నాటికి విదేశీ పెట్టుబడుల వెల్లువ మరింత పెరిగి 4,628 కోట్ల డాలర్లకు చేరింది. బిఎస్ఇ సెన్సెక్స్ అనూహ్యంగా 12,363 పాయింట్లుగా నమోదయింది. ఒక దశలో భారీగా పెరుగుతున్న షేర్లను సామాన్యుడు అందుకోలేక కేవలం 'బూమ్'ని చూస్తూ గడిపే పరిస్థితికి చేరుకున్నాడు. విదేశీ పెట్టుబడుల వెల్లువకు అడ్డు లేకపోవడంతో సెన్సెక్స్ లాగి విడిచిన బాణంలా దూసుకుపోయి 2007 అక్టోబర్ నాటికి 18,820 పాయింట్లకు చేరుకుంది. ఆనాటికి భారత స్టాక్ మార్కెట్లలో విదేశీ పెట్టుబడుల మొత్తం 6,496 కోట్ల డాలర్లకు చేరింది. కేవలం నాలుగు నెలల వ్యవధిలో అంటే 2008 జనవరి నాటికి విదేశీ పెట్టుబడులు 6,710 కోట్ల డాలర్లకు చేరింది, సెన్సెక్స్ సూచి అత్యధికంగా 20,582 పాయింట్లకు చేరింది. అంతే అక్కడితో భారత స్టాక్ మార్కెట్ల 'శుక్ర మహర్దశ' పూర్తయినట్లు విదేశీ మదుపుదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ప్రారంభించారు.

మార్కెట్లలో అనిశ్చితి

(ప్రజాశక్తి – బిజినెస్‌బ్యూరో)

గ్లోబల్ ఆర్థికవ్యవస్థ మాంద్యానికి తోడు విదేశీ మదుపు సంస్థ(ఎఫ్ఐఐ)ల అమ్మకాలు ఏ మాత్రం తగ్గకపోవటంతో మార్కెట్ల దిగజారుడు తగ్గటంలేదు. అంతకుముందు వారంలో రికార్డు పతనం చవిచూడగా, గత వారంలో రెండు సంవత్సరాల కనిష్ట స్థాయికి దిగజారి బిఎస్ఇ సెన్సెక్స్ నాలుగంకెల స్థాయికి పడిపోయింది. గత వారంలో రిజర్వు బ్యాంకు, ప్రభుత్వం తీసుకొన్న ద్రవ్య చలామణి వెసులుబాటుకై తీసుకొన్న ఏనిర్ణయం కనీసం మార్కెట్ స్థిరత్వానికి కూడా ఉపయోగపడలేదు. ద్రవ్యోల్బణం వరసగా రెండవ వారం తగ్గింది, ముడి చమురు ధరలు ప్రపంచ మార్కెట్‌లో బేరల్ 72 డాలర్ల దాకా పడిపోయాయి. కార్పొరేటు ఫలితాలు ఆశించినట్లే ఉంటున్నట్లుగా మార్కెట్ వర్గాలు అభిప్రాయం పడుతున్నాయి అయినా మార్కెట్‌ల పతనం ఆగటంలేదు.

రిజర్వు బ్యాంకు బ్యాంకుల నగదు నిల్వల నిష్పత్తిని గతంలో ఉన్న తొమ్మిది శాతం నుంచి అంతకు ముందు వారం చివరలో 1.5 శాతం తగ్గించటం ఆతరువాత మరల ఒక శాతం తగ్గించటంతో పాటు రూ.25,000 కోట్ల నిధులను బ్యాంకులకు విడుదల చేసింది. అలానే మ్యూచువల్ ఫండ్‌లకు స్వల్పకాలిక రుణాలను అందించేందుకు రెపో పద్ధతిలో మరో రూ.20,000 కోట్లను అందుబాటులో ఉంచినట్లుగా కూడా ప్రకటించింది. అలానే మార్కెట్ సెక్యూరిటీ నియంత్రణ సంస్థ సెబీ కూడా మార్కెట్లో విపరీతమైన అమ్మకాలు పెరగకుండాను, అలానే స్పెక్యూలేషన్‌ను తగ్గించేందుకు డెరివేటీవ్‌ల వ్యవహారంలో గతంలో ఉన్న మార్జిన్ మనీని పెంచింది. ఈ నిర్ణయాలేమీ మార్కెట్ తగ్గుదలకు ఏ మాత్రం పనిచేయకపోగా మరింత దిగజారాయి. ఇంతకాలం ద్రవ్యోల్బణం బాగా పెరుగుతున్నదనే అంశంతో రిజర్వుబ్యాంకు ద్రవ్యచలామణిని తగ్గిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ద్రవ్యోల్బణం ఇంకా రెండంకెల స్థాయిలో ఉండగానే ద్రవ్య చలామణిని మరింత వెసులుబాటు చేయటం తప్పని పరిస్థితికి కారణం ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణే. కాబట్టి ఈ వారం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసే కీలక అంశం ఇదే. అలానే ప్రపంచ ఆర్థిక మాంద్యం చల్లబడేవరకు తాత్కాలికంగా పెరిగినా తగ్గటం అనివార్యంగా ఉంటుందనేది మరువరానిది. అలానే ఎఫ్ఐఐలు మరింత మొత్తాలు ఉపసంహరణ చేయటం తప్పదు, అంత వరకూ మన స్టాక్ మార్కెట్లు తగ్గకా తప్పదు.

మళ్లీ వెనక్కు..?

	20.06.06	08.01.08	13.10.08
రిజిస్టరయిన ఎఫ్ఐఐలు	924	1241	1539
సబ్ అకౌంట్లు	-	3639	4696
మార్కెట్‌క్యాపిటలైజేషన్(బి.డాలర్లలో)	553	1870	680
ఎఫ్ఐఐల పెట్టుబడులు(బి.డాలర్లలో)	43.8	66.8	54.8
సెన్సెక్స్ పాయింట్లు	10,086	20,873	9,975